RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక





సంపుటి : 12 సంచిక : 238 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం శనివారం, 2 మార్చి 2024 పేజీలు : 4 వెల : 2/-

# ఎంపీ టికెట్ ఎవరికో?

## ఏఐసీసీ పెద్దల చుట్టూ కాంగ్రెస్ నేతల ప్రదక్షిణలు

## ప్రస్తుతానికి దీపాదాస్ మున్షీ వద్ద ఆగిన బంతి




హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ కోసం అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు అటు ఢిల్లీ చుట్టూ.. ఇటు సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర టీపీసీసీ పెద్దల చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇతర పార్టీల కంటే ముందే ఎంపిక ప్రక్రియ ప్రారంభించిన అధికార కాంగ్రెస్ పార్టీ టికెట్ల ఖరారు రేసులో మాత్రం కొంత వెనుకబడినట్టు కనిపిస్తోంది. బీఆర్ఎస్, బీజేపీలు చాపకింద నీరులా తమ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో ముందుకెళుతుంటే కాంగ్రెస్‌లో మాత్రం కొంత డైలమా కనిపిస్తోంది. రాష్ట్రంలో అధికారం దక్కిన నేపథ్యంలో ఇతర పార్టీల నుంచి పెద్ద చేపలు తమ గాలానికి చిక్కుతాయనే ఆలోచనతో పాటు పార్టీలో అంతర్గతంగా నెలకొన్న పోటీ కూడా ఇందుకు కారణమని తెలుస్తోంది. కాగా, టికెట్ల విషయమై త్వరలోనే ఢిల్లీలో జరిగే స్క్రీనింగ్ కమిటీ భేటీ తర్వాత స్పష్టత వస్తుందనీ, ఆ తర్వాత సీఈసీ సమావేశంలో ఖరారయ్యే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ఈలోగా ఎన్నికల నోటిఫికేషన్ కూడా వచ్చే అవకాశం ఉండటంతో సరైన సమయంలోనే అభ్యర్థుల ప్రకటన ఉంటుందని అంటున్నారు. కాగా, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ప్రస్తుతం రాష్ట్రంలో లోక్‌సభ సీట్లకు టికెట్ల ఎంపిక, అభ్యర్థిత్వాల పరిశీలనపైనే పూర్తి స్థాయి దృష్టి కేంద్రీకరించినట్టు పార్టీ వర్గాల సమాచారం.

**కొత్త నేతలకు అవకాశమిస్తారా?** : ఇటీవలే పార్టీలో చేరిన కొందరు నేతలకు లోక్‌సభకు పోటీ చేసే అవకాశం ఇస్తారనే చర్చ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ జాబితాలో బొంతు రామ్మోహన్ (సికింద్రాబాద్), కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి (మల్కాజ్‌గిరి), పట్నం సునీతా మహేందర్‌రెడ్డి (చేవెళ్ల), నీలం మధు ముదిరాజ్ (మెదక్), తాటికొండ రాజయ్య (వరంగల్) పేర్లు వినిపిస్తున్నాయి. సికింద్రాబాద్, చేవెళ్ల విషయంలో అభ్యర్థిత్వాలు దాదాపు ఖరారయ్యాయనే చర్చ కూడా జరుగుతోంది. మల్కాజ్‌గిరి సీటు కోసం దేవేందర్‌గౌడ్ తనయుడు వీరేందర్‌గౌడ్ పేరు కూడా వినిపిస్తోంది. ఆయన త్వరలోనే పార్టీలోకి వస్తున్నారని, ఆయనతో పాటు సినీ నిర్మాత బండ్లగణేశ్, కొందరు ఇతర నాయకుల పేర్లను పరిశీలిస్తారని అంటున్నారు. ఇక, మెదక్ విషయంలో మైనంపల్లి హనుమంతరావు పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయనతో పాటు వైద్య మంత్రి దామోదర రాజనర్సింహ కుమార్తె త్రిష కూడా రేసులో ఉండడం గమనార్హం. వరంగల్ విషయానికి వస్తే అక్కడ పోటీ తీవ్రంగా ఉంది. ఇక్కడి నుంచి తాటికొండ రాజయ్యతో పాటు జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి, దొమ్మాటి సాంబయ్య, సింగాపురం ఇందిర, అద్దంకి దయాకర్, డాక్టర్. ఆర్. పరమేశ్వర్ పేర్లు వినిపిస్తున్నాయి. అయితే నాగర్‌కర్నూల్, పెద్దపల్లి లోక్‌సభ స్థానాలను ఏ సామాజిక వర్గానికి ఇస్తారన్న దాన్ని బట్టి వరంగల్‌లో అభ్యర్థి ఖరారయ్యే అవకాశాలున్నాయి. నాగర్‌కర్నూల్ నుంచి టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లురవి పేరు దాదాపు ఖరారైందని తెలుస్తోంది. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, డాక్టర్ చారగొండ వెంకటేశ్ పేర్లు కూడా వినిపిస్తున్నా యి. పెద్దపల్లి నుంచి గడ్డం వివేక్ కుమారుడు వంశీ, సిట్టింగ్ ఎంపీ వెంకటేశ్ నేతకాని, పెర్క శ్యాంకుమార్‌లో ఒకరికి అవకాశం దక్కే చాన్సుంది.

**ఐదు రిజర్వుడు, మూడు బీసీ, ఒకటి మైనార్టీకి** : రాష్ట్రంలోని మొత్తం 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో మూడు ఎస్సీలకు, రెండు ఎస్టీలకు రిజర్వు అయ్యాయి. ఇవి పోను మిగిలిన 12 స్థానాల్లో మూడు స్థానాలను బీసీలకు ఇస్తారని, ఒక్క స్థానాన్ని మైనార్టీలకు కేటాయిస్తారని గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మిగిలిన 8 చోట్ల జనరల్ అభ్యర్థులు పోటీ చేయనున్నట్టు సమాచారం. బీసీలకిచ్చే స్థానాల్లో మెదక్, జహీరాబాద్, సికింద్రాబాద్ ఉంటాయని తెలుస్తోంది. హైదరాబాద్ లోక్‌సభకు మైనార్టీ నేతను పోటీ చేయిస్తారని, హైదరాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షుడు సమీర్‌వలిఉల్లాకు సీటు దక్కే అవకాశం ఉందని సమాచారం. ఈయనతో పాటు ఫిరోజ్‌ఖాన్, అలీ మస్కతి లాంటి సీనియర్ల పేర్లు కూడా మొదటి నుంచీ ప్రచారంలో ఉన్నాయి. మిగిలిన స్థానాల విషయానికి వస్తే వంశీచందర్‌రెడ్డి (మహబూబ్‌నగర్), పటేల్ రమేశ్‌రెడ్డి, జానారెడ్డి ( నల్లగొండ), చామల కిరణ్‌రెడ్డి, కుంభం కీర్తిరెడ్డి, కోమటిరెడ్డి లక్ష్మి, కోమటిరెడ్డి పవన్‌రెడ్డి, కొమ్మూరి ప్రతాపరెడ్డి, పున్నా కైలాశ్‌నేత, చనగోని దయాకర్ (భువనగిరి), సురేశ్‌షెట్కార్ (జహీరాబాద్), వీహెచ్, జెట్టి కుసుమకుమార్, పొంగులేటి ప్రసాదరెడ్డి, మల్లునందిని, వి.వి.రాజేంద్రప్రసాద్ (ఖమ్మం), పెద్దిరెడ్డి, అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, రుద్ర సంతోశ్ (కరీంనగర్), టి.జీవన్‌రెడ్డి, ముత్యాల సునీల్‌రెడ్డి, ఈరవత్రి అనిల్ (నిజామాబాద్), బలరాం నాయక్, బెల్లయ్య నాయక్, డాక్టర్. శంకర్‌నాయక్, విజయాబాయి (మహబూబాబాద్), నరేశ్ జాదవ్, రేఖానాయక్ (ఆదిలాబాద్) పేర్లు వినిపిస్తున్నాయి.

**రాహుల్ వచ్చేనా?** : ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పోటీ చేస్తారనే అంశంపై గాంధీభవన్ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. కేరళలోని వాయనాడ్ స్థానంలో ఇండియా కూటమి నుంచి సీపీఐ పోటీ చేస్తుందన్న వార్తల నేపథ్యంలో రాహుల్‌గాంధీ కర్ణాటక లేదా తెలంగాణ నుంచి బరిలో ఉంటారని తెలుస్తోంది. గతంలో కూడా సోనియా, ప్రియాంకాగాంధీ తెలంగాణలో పోటీ చేస్తారని, సోనియాగాంధీని తెలంగాణ నుంచే రాజ్యసభకు ఎంపిక చేస్తారనే వార్తలు వినిపించాయి. ఇప్పుడు తాజాగా రాహుల్ పేరు తెరపైకి రావడం గమనార్హం. ఒకవేళ ఆయన తెలంగాణ నుంచి పోటీ చేయాలని నిర్ణయం తీసుకుంటే ఖమ్మం లేదా నల్లగొండ లోక్‌సభ స్థానాల నుంచి పోటీ చేసే అవకాశమున్నట్టు తెలుస్తోంది.

## చెప్పిందే చేస్తాం.. చేయగలిగేదే చెప్తాం..



ఖమ్మం, మార్చి 1: కాంగ్రెస్ ప్రభుత్వంలో చెప్పిందే చేస్తాం.. చేయగలిగేదే చెప్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ముదిగొండ మండల సీతారాంపురం సభలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ... తనను ఈ స్థాయిలో ఉంచింది మధిర నియోజకవర్గ ప్రజలే అని.. సీతారపురం గ్రామస్థులు చల్లగా ఉండాలన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని.. పనుల విషయంలో అధికారులు పర్యవేక్షణ తప్పని సరి అని అన్నారు. ఇందిరమ్మ రాజ్యాంలో ఆరు గ్యారెంటీలు తప్పక అమలు చేసి తీరుతామన్నారు. రాష్ట్రంలో పేదలకు 2 వందల యూనిట్లు విద్యుత్, 5 వందలకే గ్యాస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కలిపిస్తున్నామన్నారు. పేదల కోసం రూ. 10 లక్షలతో ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలుచేయబోతున్నట్లు తెలిపారు. మధిర నియోజకవర్గ ప్రజల ఓటుకు గౌరం తెచ్చే విధంగా పనిచేస్తామన్నారు. రాష్ట్ర ప్రజల కోసం ప్రభుత్వంలో మంత్రులుగా కంకణ బద్ధులై పనిచేస్తున్నామన్నారు. ఉద్యోగులను గత ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేసిందని... కాంగ్రెస్ ప్రభుత్వం వారిని తిరిగి ఆదుకుంటుందని తెలిపారు.

**ప్రతి మాట.. ప్రతి వాగ్దానం నెరవేర్చేందుకు సిద్ధం..** మహిళలను ఆర్థికంగా నిలబెట్టేందుకు రాష్ట్రంలో డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలను అందజేస్తామన్నారు. నిరుద్యోగులు గత ప్రభుత్వంలో ఉద్యోగాలు రాక ఇబ్బందులు పడ్డారన్నారు. రూ. 2.75 కోట్ల బడ్జెట్ రాష్ట్ర ప్రజల సమస్యలు పరిష్కరించాలనే ఉదేశ్యంతో ప్రవేశపెట్టిందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన అతికొద్ది రోజుల్లోనే గ్రూప్ 1నోటిఫికేషన్ కూడా విడుదల చేశామన్నారు. రాష్ట్రంలో ప్రతి బిడ్డ చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలనేదే ఈ ప్రభుత్వా లక్ష్యమన్నారు. ఈ రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన ప్రతి మాట.. ప్రతి వాగ్దానం నెరవేర్చేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఎవరిని మోసం చేయాలని ఆలోచన తమకు లేదన్నారు. పదేళ్లు ప్రజలకు భ్రమలు కల్పించి పబ్బం కడుపుకోవాలనే ఆలోచన అంతకన్నా లేదన్నారు. వందేళ్ళ చరిత్ర కలిగిన ఈ పార్టీ మరో వందేళ్లు రాష్ట్రాన్ని, దేశాన్ని పాలన సాగించి ప్రజలకు అండగా నిలుస్తుందని తెలిపారు. ప్రజలను మోసం చేసి పాలన సాగిస్తే రానున్న రోజులు ఇంటికి పంపిస్తారని.. ప్రజలకు అంకితమై పని చేయాలన్నది కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు.

## పార్టీని కాపాడుకోలేని కేటీఆర్..

## రేవంత్‌కు ఛాలెంజా?

హైదరాబాద్: పార్టీని కాపాడుకోలేని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్... సీఎం రేవంత్ రెడ్డిపై ఛాలెంజ్ చేయడం చూస్తుంటే నవ్వొస్తోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మల్లు రవి పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి పవర్ ఏమిటో చూశాక కూడా కేటీఆర్ ఇలాంటి ఛాలెంజ్‌లు చేయడం మానుకోవాలన్నారు.

కేటీఆర్ పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు అయినా



గెలవడానికి ప్రయత్నాలు చేసుకుంటే మంచిదన్నారు.

మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన కేటీఆర్‌కి సిగ్గు రాలేదన్నారు. ఇప్పటికే ఒక ఎంపీ, ఒక జడ్పీ చైర్మన్ నిన్ననే పార్టీ మారారన్నారు. ఇప్పటికైనా కేటీఆర్ తన పార్టీ గురించి ఆలోచించుకుంటే మంచిదని మల్లు రవి హితవు పలికారు.

## తెలంగాణను కన్నీటి సాగుకు కేరాఫ్‌గా మారిస్తే సహించేదిలే..!



హైదరాబాద్: మళ్లీ తెలంగాణను ఎడారిగా మార్చే కాంగ్రెస్ కుట్రలను ఎండగట్టడానికే... ఈ 'చలో మేడిగడ్డ' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. చిన్న లోపాన్ని.. పెద్ద భూతద్దంలో చూపిస్తూ.. బాధ్యత మరిచిన కాంగ్రెస్ నిజస్వరూపాన్ని బట్టబయలు చేసేందుకే... ఈ 'చలో మేడిగడ్డ' అని తెలిపారు. ప్రజాధనంతో కట్టిన ప్రాజెక్టును పరిరక్షించకుండా.. కూలిపోవాలని చూస్తున్న కాంగ్రెస్ కుతంత్రాన్ని ప్రజల సాక్షిగా నిలదీయడానికే.. ఈ 'చలో మేడిగడ్డ' అని కేటీఆర్ అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పండుగలా మారిన వ్యవసాయాన్నిమళ్లీ దండగలా మార్చే కాంగ్రెస్ పన్నాగాలకు పాతరేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పంజాబ్‌నే తలదన్నే స్థాయికి ఎదిగిన తెలంగాణ రైతుకు వెన్నుపోటు పొడుస్తున్న కాంగ్రెస్ నీచ సంస్కృతికి సమాధి కట్టేందుకే ఈ 'చలో మేడిగడ్డ' అని కేటీఆర్ పేర్కొన్నారు. మరమ్మత్తులు కూడా చేతకాని "గుంపు మేస్త్రీ"ని నమ్ముకుంటే తెలంగాణ రైతు నిండా మునుగుడేనని మరోసారి చాటిచెప్పేందుకే ఈ కార్యక్రమమని అన్నారు. దశాబ్దాలపాటు.. కాంగ్రెస్ చేసిన తప్పులను.. కాంగ్రెస్ పాలనలో సాగునీటి తిప్పలను.. అరవై ఏళ్లు కాంగ్రెస్ పెట్టిన అరిగోసను అన్నదాతలు మరువలేదని గుర్తుచేస్తామని కేటీఆర్ తెలిపారు. మళ్లీ కన్నీటి సాగుకు తెలంగాణను కేరాఫ్ గా మారిస్తే సహించబోమన్నారు. మీ దుష్ట రాజకీయాల కోసం.. మా తెలంగాణ రైతాంగాన్ని బలిచేస్తే భరించేది లేదన్నారు. పోటీ యాత్రలు చేయడం కాదని.. ప్రజలు అప్పగించిన డ్యూటీ చేయాలన్నారు. మేడిగడ్డకు మరణశాసనం రాయాలని చూస్తే... తెలంగాణ గడ్డపై.. కాంగ్రెస్ కే నూకలు చెల్లడం ఖాయమన్నారు. వచ్చే వరదల్లో.. కాంగ్రెస్ పార్టీయే కొట్టుకుపోవడం తథ్యమని కేటీఆర్ అన్నారు.




# వేడెక్కిన రాజకీయాలు

## కాంగ్రెస్ - బీఆర్ఎస్ ... ఇద్దరి ఆయుధాలు సిద్ధం

హైదరాబాద్ : తెలంగాణలో రెండు ప్రధాన పార్టీల అజెండాలు సెట్ చేసుకున్నట్లున్నాయి. తొందరలోనే పార్లమెంటు ఎన్నికలు జరగబోతున్న విషయం అందరికీ తెలిసిందే. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీలు తమిష్టమొచ్చినట్లుగా అజెండాలు సెట్ చేసుకున్నాయి. అయితే రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మాత్రం తమ అజెండాను స్పష్టంగా రెడీచేసుకున్నాయి. అవేమిటంటే కాంగ్రెస్ ఏమో కాళేశ్వరం, మేడిగడ్డ బ్యారేజిల నాసిరకం నిర్మాణాలు, వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు ముసుగులో భారీ ఎత్తున అవినీతికి పాల్పడ్డారని కేసీయార్ అండ్ కో పై ఆరోపణలు చేయటం. ఇదే సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కీలకమైన సిక్స్ గ్యారెంటీస్ హామీల అమలులో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఫెయిలైందనే ప్రచారం చేయాలన్న అజెండాను బీఆర్ఎస్ అజెండాను సెట్ చేసుకున్నది. అంటే కాంగ్రెస్ ప్రధాన అజెండా కేసీయార్ హయాంలో జరిగిన సాగునీటి ప్రాజెక్టుల దోపిడిపైనే. బీఆర్ఎస్ అజెండా ఏమో గ్యారేంటీల అమలు ఫెయిల్యూర్లపైనే అని అర్ధమైపోతోంది. రెండుపార్టీలు కూడా తమ అజెండాలకు అనుగుణంగానే బేస్ ప్రిపేర్ చేసుకుంటున్నాయి. అందుకనే మేడిగడ్డ బ్యారేజి దగ్గరకు పోటీపడి మరీ సందర్శన చేస్తుండటం. తమ అజెండాలతో ప్రత్యర్థి పార్టీలను ఎంత వీలుంటే అంతగా గబ్బుపట్టించటమే సింగిల్ పాయింట్ అజెండాగా రెండు పార్టీలు డిసైడ్ అయిపోయాయి. ఆ మధ్య రేవంత్ ఆధ్వర్యంలో మంత్రులు, ఇంజనీరింగ్ నిపుణులు మేడిగడ్డబ్యారేజీని సందర్శించిన విషయం తెలిసిందే. ఆ సందర్శనలో కేసీయార్ దోపిడీపై రేవంత్, మంత్రులు పదేపదే ఆరోపణలు చేశారు. కాళేశ్వరం, మేడిగడ్డ బ్యారేజీలు సాగునీటి ప్రాజెక్టులుగా పనికిరావని మంత్రులు తేల్చేశారు. దానికి కౌంటర్ గా ఈరోజు కేటీయార్ ఆధ్వర్యంలో 200 మంది నేతలు, ఇంజనీరింగ్ నిపుణులు అదే మేడిగడ్డను సందర్శించారు. వీళ్ళు డెఫినెట్ గా ప్రాజెక్టుల నిర్మాణాన్ని సమర్ధించుకుంటు మాట్లాడటంలో సందేహంలేదు.

ఇదే సమయంలో ప్రభుత్వంపై ఎదురుదాడికి దిగటం ఖాయం. అలాగే పనిలోపనిగా సిక్స్ గ్యారెంటీస్ లోపాలపైన కూడా గొంతెత్తుతారు. మధ్యలో బీజేపీ ఏమో రెండు పార్టీలపైన తనదైన పద్దతిలో విరుచుకుపడటం ఖాయం. కాకపోతే టాప్ ప్రయారిటి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల ఆరోపణలు, ప్రత్యారోపణలకే దక్కుతాయనటంలో సందేహంలేదు. మరి మధ్యలో బీజేపీ ఎంతవరకు అడ్వాంటేజ్ తీసుకుంటుంది, ఏ మేరకు లబ్దిపొందుతుందో చూడాలి.

## సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

# మార్క్ జుకర్ బర్గ్.. వేల కోట్ల ఖర్చుతో భూగర్భ బంకర్ అందుకేనా?

ఫేస్ బుక్, ఇనస్ట్రాగామ్ సంస్థల అధినేత మార్క్ జుకర్ బర్గ్ ఏం చేసినా సంచలనమే. 30 ఏళ్ల వయసులోపే ఆయన ఫేస్ బుక్ ను బిలియన్ డాలర్ల సంస్థగా నిలిపారు. అంతేకాకుండా అత్యధిక ధనవంతుల జాబితాలోనూ నిలిచారు. ఇక ఇనస్ట్రాగామ్ ద్వారా జుకర్ బర్గ్ మరిన్ని సంచనాలకు తెర తీశారు. తాజాగా మార్క్ జుకర్ బర్గ్ తీసుకున్న నిర్ణయం హాట్ టాపిక్ గా మారింది. వేల కోట్ల రూపాయల ఖర్చుతో ఆయన భూగర్భ బంకర్ ను నిర్మిస్తుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. వివరాల్లోకి వెళ్తే మెటా సీఈవో మార్క్ జుకర్ బర్గ్, అతని భార్య ప్రిసిల్లా చాన్ తమ కోసం భూగర్భ బంకర్ ను నిర్మించాలని తలపెట్టారు. ఇందుకోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. భారత కరెన్సీలో 2,249 కోట్ల రూపాయల భారీ ఖర్చుతో దీన్ని నిర్మిస్తుండటం విశేషం. ఈ 5 వేల చదరపు అడుగుల బంకర్ ను అమెరికాలోని హవాయిలో ఉన్న జుకర్ బర్గ్ 1400 ఎకరాల పొలంలో నిర్మిస్తున్నారు. కాగా ఈ బంకర్ కి బయట ప్రపంచం నుంచి అవసరం ఏమీ ఉండదని అంటున్నారు. దానంతట అదిగా సొంత శక్తిని సమకూర్చుకునేలా నిర్మిస్తున్నారు. బంకర్ గేట్ ఒక లోహంతో, కాంక్రీటుతో నింప బడి ఉంటుందని అంటున్నారు. సాధారణంగా ఇలాంటి బంకర్లను క్షిపణి దాడులు, అణు వార్ హెడ్లు, శక్తివంతమైన బాంబుదాడులు, తీవ్రమైన తుపానుల నుంచి తప్పించుకోవడానికి వాడతారని పేర్కొంటున్నారు. కాగా ఈ బంకర్ ను మార్క్ జుకర్ బర్గ్ ఎందుకు నిర్మిస్తున్నారో.. దీనికి వేల కోట్ల రూపాయల ఖర్చు ఎందుకు పెడుతున్నారో ఇంతవరకు ఆయన కానీ, ఆయన కంపెనీల తరఫున మరెవరైనా కానీ చెప్పలేదు. కాగా ఈ బంకర్ లో అండర్ గ్రౌండ్ షెల్టర్ ఉంటుంది. బంకరులోనే డజనుకు పైగా భవనాలు నిర్మిస్తున్నారు. ఇందులో పనిచేసేవారు ఇక్కడే నివాసం ఉంటారు. బంకర్ లో ఏకంగా 30 బెడ్ రూమ్‌లు, 30 బాత్ రూమ్‌లు ఉంటాయి. ఇవి కాకుండా రెండు బంగ్లాలను కూడా నిర్మించారు. ఈ బంకర్ కు చెందిన బ్లూ ప్రింట్‌లో 11 ట్రీ హౌస్‌లు, ఫిట్‌నెస్ సెంటర్, గెస్ట్ హౌస్, అనేక ఇతర నిర్మాణాలు ఉండటం విశేషం. కాగా ఇలాంటి బంకర్ల నిర్మాణానికి గతంలో పలువురు ముందుకొచ్చారు. ప్రముఖ వెంచర్ క్యాపిటలిస్ట్ పీటర్ థీల్ కూడా గతేడాది బంకర్ ను నిర్మించుకోవాలని అనుకోగా.. స్థానిక కౌన్సిల్ ఆ ప్లాన్ ను అంగీకరించలేదు. బంకర్ నిర్మాణంతో చుట్టుపక్కల పర్యావరణం దెబ్బతింటుందని అభ్యంతరం వ్యక్తం చేసింది. అలాగే అమెరికా ధనవంతుల్లో ఒకరిగా ఉన్న డూమ్‌డే కూడా మార్క్ జుకర్ బర్గ్ లాగే బంకరును నిర్మించారు.

# ప్రజాపాలన సేవా కేంద్రాలను సత్వరమే నెలకొల్పాలి

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి





**ఆదిలాబాద్ మార్చి 1(ప్రభాత సమాచారం)**
వివిధ వర్గాల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం అభయహస్తం కింద అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరేలా కృషి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతి కుమారి కలెక్టర్లకు సూచించారు. మహాలక్ష్మి, గృహాజ్యోతి పథకాల ద్వారా అర్హత కలిగిన వారందరు ప్రయోజనం పొందేలా అన్ని ఎంపీడీఓ కార్యాలయాలు, మున్సిపల్ వార్డు ఆఫీసులలో సత్వరమే ప్రజాపాలన సేవా కేంద్రాలను నెలకొల్పాలని ఆదేశించారు. రాష్ట్ర డీ.జీ.పీ రవిగుప్తాతో కలిసి శుక్రవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, సీ.పీలు, ఎస్పీలతో సి.ఎస్ సమీక్ష నిర్వహించారు.
ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా దరఖాస్తులు చేసుకోలేకపోయిన అర్హులైన వారితో పాటు, దరఖాస్తులలో సరైన వివరాలు నమోదు చేయని వారి కోసం ప్రజాపాలన సేవా కేంద్రాలను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలని సూచించారు. కొత్తగా ఏర్పాటైన పలు మండలాల లో ఎంపిడిఓ కార్యాలయాలు లేనందున, అలాంటిచోట తహశీల్ ఆఫీసులలో ప్రజాపాలన సేవా కేంద్రాలను అందుబాటులోకి తేవాలన్నారు. ఈ కేంద్రాలు శాశ్వత ప్రాతిపదికన పనిచేసే అవకాశాలు ఉన్నందున, ఇంటర్నెట్ సదుపాయంతో కూడిన కంప్యూటర్ ఏర్పాటు చేస్తూ, డేటా ఎంట్రీ ఆపరేటర్ ను నియమించాలని అన్నారు. వచ్చే సోమవారం నాటికి అన్ని చోట్ల సేవా కేంద్రాలు అందుబాటులోకి వచ్చి పనితీరు ప్రారంభం కావాలని ఆన్నారు. కార్యాలయాల పని దినాలలో ప్రతి రోజు ఉదయం 10.30 నుండి సాయంత్రం 5.00 గంటల వరకు సేవ కేంద్రాలు తెరిచి ఉంచాలన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకోలేకపోయిన వారి కోసం కొత్తగా దరఖాస్తులు చేసుకునేందుకు వీలుగా అభయహస్తం దరఖాస్తు ఫారాలను ప్రజాపాలన సేవా కేంద్రాలలో అందుబాటులో ఉంచాలన్నారు. అదేవిధంగా సరైన రీతిలో వివరాలను పొందుపర్చలేకపోయిన దరఖాస్తుదారుల వివరాలను సరిచేస్తూ ఆన్లైన్లో అప్ డేట్ చేసేలా చర్యలు తీసుకోవాలని సీ.ఎస్ సూచించారు. ముఖ్యంగా వంట గ్యాస్ ఏజెన్సీ పేరు, వినియోగదారుడి నెంబరు, రేషన్ కార్డు వివరాలు, మొబైల్ నెంబరు తదితర వాటిని సరిచేస్తూ ఆన్లైన్లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**టెన్త్, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి**
ప్రస్తుతం కొనసాగుతున్న ఇంటర్మీడియట్ తో పాటు, త్వరలో ప్రారంభం కానున్న పదవ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి సూచించారు. ఏ చిన్న తప్పిదాలు, అవాంఛనీయ ఘటనలకు సైతం తావులేకుండా కట్టుదిట్టంగా వ్యవహరించాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షా కేంద్రాలలోకి సెల్ ఫోన్లను అనుమతించ కూడదని, కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా గట్టి చర్యలు చేపట్టాలన్నారు. నిర్లక్ష్యానికి తావిస్తూ, అక్రమాలకు ఆస్కారం కల్పించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అన్నారు. పరీక్షల నిర్వహణ తీరును అనునిత్యం సమీక్షిస్తూ, పరీక్షలు ముగిసేంత వరకు ఎంతో జాగరూకతతో వ్యవహరించాలని కలెక్టర్లకు సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, కాపీయింగ్ జరిగేందుకు అవకాశం ఉన్న సెంటర్ల వద్ద అదనపు సిబ్బందిని నియమించాలని పోలీస్ కమిషనర్లు, ఎస్పీలకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా పాలనాధికారి రాహుల్ రాజ్, ఎస్ పి గౌస్ ఆలం, అదనపు కలెక్టర్ శ్యామల దేవి, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అధికారులు,ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలి :ఎంపీపీ



**తాండూర్, మార్చి1(ప్రభాత సమాచారం)**
ప్రజాప్రతినిధుల సమన్వయంతో మండలానికి చెందిన ప్రత్యేక అధికారులు అభివృద్ధి పనులు చేపట్టాలని తాండూర్ ఎంపీపీ పూసల ప్రణయ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం తాండూర్ మండల సర్వసభ్య సమావేశం తాండూర్ ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ తమ శాఖల నివేదికలను సర్వసభ్య సమావేశంలో చదివి వినిపించారు. సర్పంచుల పదవీ కాలం ముగియడంతో వారి స్థానంలో స్థానంలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మండలాల మండలానికి చెందిన వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులను గ్రామపంచాయతీలలో ప్రత్యేక అధికారులుగా నియమించిన విషయం తెలిసింది.కాగా ప్రత్యేక అధికారులు తమకు ఎలాంటి సమాచారం లేకుండానే అభివృద్ధి పనులు చేస్తున్నారని పలువురు ఎంపీటీసీలు సమావేశం దృష్టికి తీసుకురాగా ఎంపీపీ జోక్యం చేసుకొని పంచాయితీల ప్రత్యేక అధికారులు ప్రజాప్రతినిధులైన ఎంపీటీసీలకు ప్రోటోకాల్ పాటించి అభివృద్ధి పనుల్లో సమాచారం అందించాలని ఎంపీడీవో పి శ్రీనివాస్ ను కోరగా ప్రజాప్రతినిధులకు ముందస్తుగా సమాచారం ఇచ్చే విధంగా చూస్తానని తెలిపారు. మండలానికి చెందిన కొందరు ఉన్నతాధికారులు తరచూ సమావేశమునకు గైరాజ్యరు అవడంపై సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీ సిరంగి శంకర్ ప్రస్తావించగా ఎంపీపీ జోక్యం చేసుకొని సర్వసభ్య సమావేశాలకు గైరాజరై క్రింది స్థాయి అధికారులను సర్వసభ్య సమావేశమునకు పంపే అధికారులపై తగిన చర్యలు తీసుకునేలా చూడాలని ఎంపీడీవోను ఎంపీపీ కోరగా ఎంపీడీవో స్పందిస్తూ సర్వసభ్య సమావేశమునకు గైరాజరై క్రింది స్థాయి అధికారులను పంపే మండలానికి చెందిన ఉన్నతాధికారులపై నివేదికలను జిల్లా స్థాయి అధికారులకు పంపి తగిన చర్యలు తీసుకునేలా చూస్తానని ఎంపీడీవో తెలిపారు. రానున్న వేసవికాలం దృష్ట్యా మండలంలోని గ్రామాల్లో త్రాగునీటి ఎద్దడి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు సమావేశం దృష్టికి తీసుకురాగా ఎంపీపీ స్పందిస్తూ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామపంచాయతీల ప్రజలకు త్రాగునీటి సరఫరా విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించ కుండా సకాలంలో చర్యలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని, అలాగే చెడిపోయిన బోరుబావులను గుర్తించి మరమ్మత్తులు చేయించేలా చూస్తామని ఎంపీడీవో తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశంలో తాండూర్ తహసిల్దార్ ఇమ్రాన్ ఖాన్,సింగల్ విండో చైర్మన్ ఎస్ దత్తు మూర్తి, కో ఆప్షన్ సభ్యులు ఎండి రహమత్ ఖాన్, ఎంపీటీసీలు రెబ్బెన యశోద,డి నారాయణ, మొగిలి శంకర్, పెరక రజిత, గోమాస స్వాతి లతోపాటు మండలానికి చెందిన వివిధ శాఖలకు చెందినఅధికారులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



**గంభీరావుపేట మార్చి 1(ప్రభాత సమాచారం):**
గంభీరావుపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ ఆధ్వర్యంలో గంభీరావుపేట మండలానికి సంబంధించిన నిరుద్యోగులు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నిరుద్యోగులు మరియు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించిన తర్వాత మెగా డీఎస్సీ నిర్వహించడం ఇదే మొదటిదని తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగులు కలలు కన్న ఉద్యోగుల తెలంగాణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ఉద్యోగ నియామకాల వల్ల నిరుద్యోగుల తెలంగాణ కాస్త ఉద్యోగుల తెలంగాణ గా మారనుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం వస్తే మన నీళ్లు మనకు మన నిధులు మనకు మన నియామకాలు వస్తాయని ఆశించి ఉద్యోగులు కెసిఆర్ కుటుంబ పాలనలో నయా వంచనకు గురయ్యామని కేవలం కల్లబొల్లి మాటలు చెప్పి పదేళ్ల కాలాన్ని కుటుంబ పాలనను కొనసాగించారే తప్ప ఉద్యోగుల కోసం విద్యార్థుల కోసం ఏనాడూ కేసీఆర్ ప్రభుత్వం పనిచేయలేదని నిరుద్యోగుల తెలంగాణగా మార్చి తెలంగాణ నిరుద్యోగుల విద్యార్థుల ఆత్మహత్యలకు కారకులు ముమ్మాటికి కేసీఆర్ కుటుంబమేనని దుయ్యబట్టారు.రానున్న రోజుల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ఖాళీగా ఉన్న రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ శాఖ అధ్యక్షుడు పాపా గారి రాజు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గంగి స్వామి, మైనారిటీ జిల్లా కార్యదర్శి తాజుద్దీన్, కొత్తపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు మెడ భాస్కర్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మేడరమ, నిరుద్యోగులు వెంకటేష్,రాజు, శ్రీకాంత్, భరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న బి ఆర్ ఎస్ నాయకులు



**గంభీరావుపేట (సిరిసిల్ల)మార్చి 1:(ప్రభాత సమాచారం)**
రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జ్ గడ్డం మధుకర్ (చోటు) ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరమ్మ కాలని గ్రామం నుండి బి ఆర్ ఎస్ పార్టీ కి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఇందిరమ్మ కాలని మాజీ వార్డు మెంబర్లు దుస మహేందర్, సామల సరస్వతి-సత్యనారాయణ, కారంపూరి కమల ను సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి ఖండ్వ కప్పి అహ్వానించారు. ఈ కార్యక్రమంలో తంగళ్లపల్లి మండల జడ్పీటీసీ పుర్మాని మంజుల లింగారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు జాలగం ప్రవీణ్ (టోనీ), మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు హారిక, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గుగ్గిళ్ల శ్రీకాంత్ గౌడ్, మల్లేష్ యాదవ్, గోరింటల రాజమల్లు జంగంపల్లి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి గౌరవ శ్రీ నరేంద్ర మోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలి

### మాజీ ఎంపీ రమేష్ రాథోడ్



**అదిలాబాద్ మార్చి 1(ప్రభాత సమాచారం)**
అదిలాబాద్‌లో ఈనెల 4న జరుగనున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలనీ మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ కోరారు. శుక్రవారం ఇంద్రవెల్లిలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో అయన మాట్లాడారు.ప్రధాన మంత్రి ఆదిలాబాద్ లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని అన్నారు. అనంతరం బహిరంగ సభ ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ మండల అధ్యక్షులు ఆరేళ్ల రాజలింగం, జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు మరప రాజు. జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు చంపత్ రావ్ పటేల్ .బిజెపి నాయకురాలు రాధిక రాథోడ్ మండల ఉపాధ్యక్షుడు రాథోడ్ భీంరావ్ . దిలీప్ మోరే.రాజ వర్ధన్. దేవ పూజ మారుతి. గిరి లాహనే.బండేవార్ సంతోష్.చరక్ సుధీర్ కుమార్.భూత్ అధ్యక్షులు శక్తి కేంద్ర ఇన్చార్జి తదితరులు పాల్గొన్నారు.

# ఆ బావి నీరు.. ఆహా..!

మోతె : చోళ రాజులు వందల ఏళ్ల క్రితం నిర్మించిన మంచినీళ్ల బావి అది. నోట్లో నీరు పోసుకోగానే కొబ్బరినీళ్లను తలపించే రుచి, శుచితో 20వ శతాబ్దపు ప్రజలతో ఆహా అనిపించిన స్వచ్ఛమైన తాగునీటిని అందించిన గిరక బావి. హైదరాబాద్‌ను ఏలిన నిజాం నవాబులు రుచి చూసి వహ్వా అంటూ నిత్యం గుర్రాలపై తెప్పించుకుని సేవించిన మంచినీటి బావి. అంతేకాదు గ్రామంలో ఎన్నికల ప్రచారం సందర్భంగా జాతీయ నాయకుడు రాజీవ్‌గాంధీ ఇందులోని నీళ్లను తాగి ఆహా ఏమిరుచి అని కీర్తించిన చరిత్ర కలిగిన మంచినీటి బావి. ఈ బావి ఎక్కడో లేదండీ.. సూర్యాపేట జిల్లా మోతె మండలం సిరికొండ గ్రామంలో ఉంది.

**సంస్కృతి ప్రతిబింబించేలా...**
సుమారు దశాబ్దన్నర కాలంగా పడావు పడింది. స్థానికులు ఆకురాళ్ల బావిగా పిలుచుకుంటారు. ప్రస్తుతం పక్కన వీధికి ఆవలి వైపున పెద్ద మురుగుకాల్వ నిర్మించడంతో అందులో నుంచి మురుగునీరు బావిలోకి లీకై ప్రస్తుతం పడావు పడింది. అప్పట్లో చోళరాజులు సిరికొండను రాజధానిగా చేసుకుని పాలించిన సందర్భంగా చుట్టుపక్కల ప్రాంతాల్లో అనేక దేవాలయాలు నిర్మించారు. ఇక్కడ విష్ణు ఆలయం నిర్మిస్తున్న సందర్భంగా మంచి నీళ్ల కోసం గ్రామంలో పెద్దగుట్ట పక్కన ఈ బావి తవ్వించారని స్థానికులు గుర్తు చేసుకుంటారు. 50 ఎకరాల విశాలమైన



ఎత్తయిన గుట్ట పక్కన ఇంత నిండు జలాలతో నీరూరే బావి పడటం విస్తుగొలిపే విషయమే. సుమారు 20 అడుగుల లోతు తవ్వి పెద్ద బండరాళ్లతో చుట్టూ మెట్లతో నిర్మించిన ఈ బావిలోని నీరు కొబ్బరినీళ్లలా పల్చగా ఎంతో రుచితో ఉంటాయని ఇప్పటికీ గ్రామస్థులు కీర్తిస్తున్నారు. నిజాం నవాబు కుటుంబం గుర్రాలపైన నిత్యం ఈ బావి నుంచే నీటిని తరలించి తాగేందుకు వాడేవారని వివరిస్తున్నారు. నాటి రాజుల సంస్కృతిని ప్రతిబింబిస్తూ పెద్ద బండరాళ్లతో నిర్మించిన ఈ బావి నేటికీ చెక్కు చెదరలేదు. ఇప్పటికీ బావిలో జలాలు ఎండక నిండా నీళ్లతో తొణికిసలాడుతుండటం విస్మయానికి గురిచేస్తుంది. ఏళ్లనాటి చరిత్ర ప్రతిబింబించే ఈ బావి చుట్టూ చెత్తా చెదారంతో నిండిపోయి పడావుపడింది. చరిత్ర పుటల్లో నిలిచిన ఈ బావిని తిరిగి వాడుకలోకి తెచ్చి కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.

# పాలేరు.. తోడేస్తున్నారు!

ఖమ్మం : మూడు జిల్లాల వాసులకు తాగునీరందించే పాలేరు రిజర్వాయర్‌లో నీటిమట్టం వేగంగా పడిపోతోంది. బుధవారం ఉదయం 14.4 అడుగులుగా ఉంది. ప్రస్తుతం ఐదు రోజులకు అడుగు చొప్పున నీటిమట్టం తగ్గిపోతోంది.

ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లో 2,439 ఆవాస ప్రాంతాల్లోని ప్రజలకు పాలేరు రిజర్వాయర్ నుంచి మిషన్ భగీరథ పథకాల ద్వారా తాగునీరు అందిస్తున్నారు. ఈ జిల్లాలకు రోజుకు రా వాటర్ 0.013706 టీఎంసీలు అవసరం. వీటిని ట్రీట్‌మెంట్ ప్లాంట్స్‌లో శుద్ధి చేసి సరఫరా చేస్తారు. ప్రస్తుతం రిజర్వాయర్ నీటిమట్టం తగ్గుతుండటంతో తాగునీటి గండం పొంచిఉంది. ఇప్పుడున్న నిల్వలు 15 రోజుల అవసరాలకు సరిపోతాయని నీటిపారుదల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మిషన్ భగీరథ అధికారులు మాత్రం



20 నుంచి 30 రోజులపైన ఆయా ఇన్‌టేక్ వెల్స్ నుంచి డబ్ల్యుటీపీలకు అందుతాయని లెక్కిస్తున్నారు.

వేలాది మోటార్లతో...: జలాశయం వెనుక ప్రాంతంలో మూడు జిల్లాల్లో రైతులు వేల సంఖ్యలో వ్యవసాయ మోటార్లు అమర్చారు. దీంతో నీటిమట్టం త్వరగా తగ్గుతోందని అధికారులు చెబుతున్నారు. సాగర్ ప్రధాన కాలువలో కోదాడ నియోజకవర్గం నుంచి పాలేరు వరకు 20 కి.మీ. పొడవునా బెడ్ లెవల్‌లో కొంత నీరు నిల్వ ఉంటుంది. పై ప్రాంత రైతులు అందులోని నీటినీ తోడేస్తున్నారు. ఒకవేళ సాగర్ నుంచి మరోసారి నీటిని విడుదల చేసినా గతంలోలా త్వరగా రిజర్వాయర్‌కు నీరు చేరుకోలేని పరిస్థితి ఏర్పడింది.

కావాల్సిన నీరు ఏడాదికి (టీఎంసీల్లో)...

ఖమ్మం – 1.533
మహబూబాబాద్ – 2.65
సూర్యాపేట – 0.818


# ఎవరివి? ఎక్కడివి?

ఇల్లెందు : రూ.15వేల రుణం ఇస్తామని అమాయక మహిళలను నమ్మించి వారి నుంచి అవసరమైన పత్రాలు తీసుకున్నారు. వారికి తెలియకుండానే అతివల పేరిట బ్యాంకు ఖాతాను తెరచి రూ.లక్షల్లో సొమ్ము అందులో పోగేశారు. తీగ లాగితే డొంక కదిలినట్టు బ్యాంకు సిబ్బంది, బాధితుల విచారణలో ఆశ్చర్యకర విషయాలు వెలుగుచూశాయి. తమ పేరిట బ్యాంకు ఖాతాలో రూ.లక్షలున్నాయని తెలుసుకుని, ఆ సొమ్ము ఎలా వచ్చిందో తెలియక మహిళలు ఆందోళన చెందుతున్నారు. ఇల్లెందు పరిధిలో వెలుగు చూసిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి

ఇల్లెందు మండలం ఇందిరానగర్‌కు చెందిన ఓ యువకుడి సాయంతో ఖమ్మానికి చెందిన ఇద్దరు వ్యక్తులు గత డిసెంబరులో అయిదుగురు మహిళలను కలిశారు. ఒక్కొక్కరికి రూ.15వేల రుణం వచ్చేలా చేస్తామని వారికి ఆశచూపారు. దీనికోసం బ్యాంకులో సమర్పించేందుకు పత్రాలు (పాన్‌కార్డు, ఆధార్), ఫొటోలు కావాలని తీసుకున్నారు. తిరిగి జనవరిలో మహిళల వద్దకు వచ్చి బ్యాంకుకు సంబంధించిన పత్రాలు, చెక్కులపై సంతకాలు తీసుకొని రుణాలు రానున్నాయని చెప్పారు. కొన్ని రోజుల తరువాత ఫోన్ చేసి రూ.15వేల రుణం వచ్చిందని, ఖర్చులు పోనూ రూ.14వేల చొప్పున ఇస్తున్నామని ఒక్కొక్కరికి చెప్పారు. రూ.14వేల చొప్పున వారికి ఇదివరకే ఉన్న స్థానిక ఖాతాలోకి ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపారు. రుణం తీరే వరకు నెలకు రూ.550 చొప్పున చెల్లించాలని సూచించారు. ఫిబ్రవరి నెల మధ్యలో రుణ చెల్లింపు గడువు రావటంతో రూ.550ను మహిళలు చెల్లించారు.

ఇలా వెలుగుచూసింది..

ఖమ్మం నగరంలోని గాంధీనగర్ పరిధిలో ఉన్న ఓ బ్యాంకులో అయిదుగురు మహిళల పేరిట అక్రమార్కులు కరెంట్ ఖాతా తెరిచారు. చిరునామా, ఇతర వెరిఫికేషన్ కోసం ఆ బ్యాంకుకు చెందిన ఇల్లెందు శాఖ ఉద్యోగులు మహిళల వద్దకు మంగళవారం వెళ్లారు. ఖమ్మంలో తమకు బ్యాంకు ఖాతా ఉందన్న సంగతి తెలియదని బాధిత మహిళలు, వారి కుటుంబ సభ్యులు విచారణ సిబ్బందికి తెలిపారు. పూర్తి వివరాలు ఖమ్మం వెళ్లి తెలుసుకోవాలని బ్యాంకు సిబ్బంది సూచించారు. కుటుంబ సభ్యులతో కలిసి మహిళలు ఖమ్మంలోని సదరు బ్యాంకు వద్దకు వెళ్లి విచారించారు. అయిదుగురి పేరిట కరెంట్ ఖాతా ఉన్నట్టు, అందరి



పేరుతో కలిపి రూ.30 లక్షల వరకు డబ్బులు అందులో జమైనట్లు గుర్తించి ఆశ్చర్యపోయారు. ఈ సొమ్ములో రూ.10లక్షలు బుధవారం ఒక్కరోజే జమైనట్టు గుర్తించారు. అంత డబ్బులు ఎలా వచ్చాయో తెలియక ఆందోళన చెందుతున్నారు. తాము సంతకాలు చేసిన చెక్కులు కూడా ఆ బ్యాంకులో ఉన్నాయని నిర్ధారించు కున్నారు. బ్యాంకు సిబ్బంది సూచనతో స్థానిక యువకుడితోపాటు ఖమ్మంకు చెందిన వారిపై ఇల్లెందు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇల్లెందు యువకుడు సైతం వారెవరో తనకూ తెలియదంటూ పోలీసులకు ఫిర్యాదు చేయటం గమనార్హం.


ఎందుకోసమో..?

వేర్వేరు మొత్తాల్లో అయిదుగురి ఖాతాల్లో జమయిన రూ.30 లక్షలు ఎక్కడివి? ఎవరు వేశారు? ఏ ఉద్దేశంతో ఖాతాలు తెరిచారు? హవాలా సొమ్మా? భారీ రిజిస్ట్రేషన్ కోసం జమ చేసిన నల్లధనమా? బాధిత మహిళల పేరిట రుణాలేమైనా తీసుకున్నారా? తదితర ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పోలీసు విచారణలో చిక్కుముడి వీడే అవకాశం ఉంది. బ్యాంకు సిబ్బంది కూడా ఇంకా పూర్తి వివరాలు వెల్లడించలేదు.

విచారణ జరుపుతున్నాం..కరుణాకర్, సీఐ, ఇల్లెందు

తమకు తెలియకుండా కొందరు బ్యాంకు ఖాతా తెరవడంతోపాటు రూ.లక్షల్లో మోసగించేందుకు యత్నించారనే ఫిర్యాదు అందింది. దీనిపై విచారణ జరుపుతున్నాం.

# ఆర్అండ్‌బీ శాఖలో కలకలం



కరీంనగర్ : కరీంనగర్ జిల్లా కేంద్రంలో రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన తీగల వంతెన.. అతిథిగృహం పనులపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు జిల్లా పాలనాధికారి విచారణకు ఆదేశించడంతో ఆ శాఖ అధికారుల్లో కలకలం రేపుతోంది. ఇప్పటికే విశ్రాంతి అతిథిగృహం పనులపై విజిలెన్స్ అధికారులు విచారణ జరుపుతుండగా మరో విచారణకు ఆదేశాలు రావడంతో అధికారులు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వంలో పనులు.. కొత్త ప్రభుత్వంలో విచారణలు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరగా పూర్తి చేయాలని గత ప్రభుత్వ నేతలు నిబంధనలకు నీళ్లు వదిలారంటూ, ప్రస్తుత ప్రభుత్వ నేతలు విచారణలకు ఆదేశించడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. మొత్తం మీద ఈ రెండు పనులపై విచారణ ఆ శాఖలో చర్చనీయాంశంగా మారింది.

తీగల వంతెనపై ..తీగల వంతెన ప్రారంభించిన కొత్తల్లోనే తారు దెబ్బతినడం, రోడ్డు గుంతలు పడటంతో గందరగోళానికి గురి చేసింది. రూ.224 కోట్లతో తీగల వంతెన పనులు చేపట్టారు. రూ.181 కోట్లు వంతెనకు, రూ.40 కోట్లు అప్రోచ్ రోడ్లకు ఖర్చు చేశారు. మూడు ఐలాండ్‌ల నిర్మాణం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా చేపట్టారు. తీగల వంతెన పనులను టాటా గులె మార్క్ సంస్థ పూర్తి చేసి బిల్లులు పొందింది. తపస్వి సంస్థ డిజిటల్ లైటింగ్ పనులు పూర్తి చేసింది. అప్రోచ్ రోడ్ పనులను స్థానిక గుత్తేదారులు నిర్మించారు. ఈ పనులకు రూ.5 కోట్లకు పైగా చెల్లించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో విచారణ చేస్తుండటంతో గుత్తేదారులు, అధికారులు ఎక్కడికి దారి తీస్తుందో అన్న ఆందోళనలో ఉన్నారు. విచారణ కమిటీ ఆదేశాల మేరకు పూర్తి వివరాల రికార్డు కమిటీకి అందజేశారని, పనుల్లో ఎలాంటి అవకతవకలు లేవని ఆర్అండ్‌బీ శాఖకు చెందిన ఒక అధికారి'కు తెలిపారు.

అతిథిగృహంపై విజి'లెన్స్'

రూ.13 కోట్ల వ్యయంతో కరీంనగర్‌లోని పాత ఆర్అండ్‌బీ అతిథిగృహం స్థానంలో అధునాతన హంగులతో కొత్త భవనాన్ని నిర్మించారు. గతేడాది జనవరిలో అప్పటి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. వాస్తవంగా 2018లో ఈ భవన నిర్మాణానికి రూ.7.25 కోట్లతో పనులు చేపట్టేందుకు సాంకేతిక మంజూరు లభించింది. 2019లో సీఎం హామీ నిధుల కింద రూ.4.25 కోట్లు విడుదలయ్యాయి. పనులు చేపట్టగా నిధులు సరిపోకపోవడంతో మినరల్ సెస్ నిధులు రూ.కోటి విడుదలకు అప్పటి కలెక్టర్ హామీ ఇచ్చారు. పనుల్లో భాగంగా రూ.4.25 కోట్లు చెల్లించారు. మిగిలినవి అప్పటి ముఖ్య నేతల ఒత్తిడి మేరకు చకచకా చేపట్టారు. ఈ నిధులతో కూడా భవన నిర్మాణం పూర్తి కాకపోవడంతో రూ.7.75 కోట్ల పనులకు టెండర్లు పిలిచారు. టెండర్ ఆమోదం, సాంకేతిక మంజూరు రాగా ఈలోగా ప్రభుత్వాలు మారాయి. కొత్త ప్రభుత్వంలో కొందరు నాయకుల ఫిర్యాదు మేరకు విజిలెన్స్ విచారణ జరుపుతోంది. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఇటీవల సమీక్ష సమావేశంలో ఈ పనులపై విచారణకు ఆదేశించారు. దీంతో జిల్లా పాలనాధికారి నలుగురు అధికారులతో కూడిన కమిటీ వేయడం, విచారణ ప్రక్రియ సాగుతోంది.

# పదవుల కోసం పైరవీలు




హుజూర్‌నగర్ : మార్కెట్ యార్డులకు పాలకవర్గాలను నియమించేందుకు రిజర్వేషన్లు ఖరారు చేసిన రెండు రోజుల్లోనే రాష్ట్రంలో రెండు మార్కెట్ యార్డులకు పాలకవర్గాలను నియమించడంతో ఉమ్మడి జిల్లాలో మార్కెట్ పదవుల కోసం వేట ప్రారంభించారు. నియామక పదవులు పార్లమెంట్ ఎన్నికల తరువాత ఉండవచ్చునని అనుకుంటున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం అనూహ్యంగా మార్కెట్‌లకు ఉన్న పాత కమిటీలను రద్దు చేయడం, ఆ వెంటనే మార్కెట్ యార్డులకు రిజర్వేషన్ల ఖరారు చేసింది. వెంటనే సదాశివపేట, బోథ్ మార్కెట్ యార్డులకు నూతన పాలకవర్గాలను ప్రభుత్వం నియమించింది. ప్రభుత్వం వేగంగా పాలకవర్గాల ఏర్పాటుకు ముందుకు రావడంతో ఉమ్మడి జిల్లాలోని మార్కెట్ యార్డుల పరిధిలో ఉన్న ఆశావహులు ఆగమేఘాల మీద తమ పైరవీలు షురూ చేశారు.

హడావుడి ప్రారంభం..

మార్కెట్ యార్డుల పాలకవర్గాల పదవుల నియామకం తెరపైకి రావడంతో జిల్లాలో నాయకుల హడావుడి ప్రారంభమైంది. హుజూర్‌నగర్, కోదాడ నాయకులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసేందుకు బయలుదేరారు. రెండు నియోజకవర్గాల్లో మూడు మార్కెట్ కమిటీలు ఉన్నాయి. కోదాడలో ఒకటి ఉండగా అది ఎస్సీ మహిళకు రిజర్వు అయింది. హుజూర్‌నగర్ మార్కెట్ యార్డు ఓసీ మహిళ, నేరేడుచర్ల బీసీ మహిళకు రిజర్వు అయ్యాయి. నియోజకవర్గంలో వీటిపై ఆశలు పెంచుకున్న కొందరు నాయకులకు అవకాశం లేకపోవడంతో తమ భార్యలను తెరమీదకు తీసుకువస్తున్నారు. హుజూర్‌నగర్ మార్కెట్ పదవి కోసం నిన్న, మొన్నటి వరకు నాదే అంటూ తిరిగిన నాయకుడు ప్రస్తుతం ఆయన భార్యకు పదవి ఇవ్వాలని కోరుతూ ప్రయత్నాలు మొదలుపెట్టారు. కోదాడ నాయకులు సైతం తమ అనుయాయులకు ఇప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇదే పరిస్థితి ఇతర మార్కెట్‌లలో ఉన్నప్పటికీ రిజర్వేషన్లకు అనుగుణంగా నాయకులు చక్రం తిప్పేందుకు నాయకులు పైరవీలు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి జిల్లాలో ఉన్న 21 మార్కెట్ యార్డులకు కొత్త పాలకవర్గాల నియామకాలు జరపాల్సి ఉంది. ఆయా కమిటీలకు ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు, కమిటీ సభ్యులను నియమించాల్సి ఉంది. ప్రస్తుతం జిల్లాలో మంత్రులైన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిల ద్వారా తమ పనులను చక్కదిద్దుకునేందుకు మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవుల ఆశావహులు ప్రయత్నాలు షురూ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఒక్క సూర్యాపేట మార్కెట్ మినహా ఇతర మార్కెట్ యార్డులకు పాలకవర్గాల నియామకాల విషయంలో ఎమ్మెల్యేలు, మంత్రులు చక్రం తిప్పే అవకాశం ఉంది. సూర్యాపేట మార్కెట్ యార్డు అతిపెద్ద మార్కెట్ యార్డు అయినప్పటికీ ఇక్కడ మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అయితే ఇక్కడ నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ నాయకులు చక్రం తిప్పే అవకాశం ఉంటుంది.

# టీ ఫైబర్ సేవలెప్పుడు?

హుస్నాబాద్ : ప్రతీ పంచాయతీకి అంతర్జాల సౌకర్యం కల్పించేందుకు గత ప్రభుత్వం చేపట్టిన టీఫైబర్ కార్యక్రమం ఆశించిన లక్ష్యం నెరవేరడం లేదు. కేబుల్ వైర్లు వేసి పరికరాలు బిగించినెలలు గడుస్తున్నా అంతర్జాల కనెక్షన్ మాత్రం ఇవ్వలేదు. దీంతో పరికరాలన్నీ అలంకారప్రాయంగా మారాయి.

టీ ఫైబర్ ద్వారా పంచాయతీలకు, ఆ తర్వాత ఇంటింటికీ కనెక్షన్లు ఇచ్చి అంతర్జాల సౌకర్యాన్ని అందుబాటులోకి తేవాలనుకున్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా అన్ని రోడ్లను తవ్వి ఫైబర్ కేబుల్ వైర్లు వేశారు. కార్యాలయాల్లో అంతర్జాలానికి సంబంధించిన పరికరాలు బిగించారు. విద్యుత్తు సదుపాయం కోసం సౌరఫలకాలు ఏర్పాటు చేసి పరికరాలు నడిచేలా అనుసంధానించారు. ఆ తర్వాత ఎంపీడీవో ఆఫీసులో పరికరాలు ఏర్పాటు చేసి అక్కడి నుంచి గ్రామ పంచాయతీలకు అనుసంధానించారు. వీటి ద్వారా ఇంటర్నెట్ వస్తుందా లేదా అనే విషయం తెలుసుకునేందుకు టెస్టింగ్ సైతం నిర్వహించారు. ఆ తర్వాత వదిలేశారు. ఇప్పటివరకు కనెక్షన్లు ఇవ్వకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఫలితంగా జిల్లాలోని చాలా మండలాల్లో అంతర్జాల సేవలు అందడం లేదు.

చరవాణి నుంచి.. నెట్ సౌకర్యం లేక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. చరవాణుల ద్వారా వైఫై కనెక్ట్ చేసుకుని అంతర్జాల సేవలు పొందుతున్నారు. దీని ద్వారా వచ్చే నెట్ వేగం తక్కువగా ఉంటోందని, సిగ్నల్స్ సరిగా అందడం లేదని వాపోతున్నారు. ఫైల్స్ డౌన్‌లోడ్ కావడం లేదని కంప్యూటర్ ఆపరేటర్లు తెలిపారు.

పనులు పూర్తి కాలేదు–రాజేందర్, ఫైబర్‌నెట్ ప్రతినిధి

టీ ఫైబర్ పనులు ఇంకా పూర్తి కాలేదు. రౌటర్లు బిగించాల్సి ఉంది. రోడ్డు పనులతో అక్కడక్కడ కేబుల్‌వైర్లు ధ్వంసమయ్యాయి.

ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు–దేవకీదేవి, డీపీవో



జిల్లాలోని దాదాపు అన్నీ పంచాయతీల్లో టీఫైబర్ కార్యక్రమం కింద వ్యవస్థ ఏర్పాటు చేశారు. అనేక చోట్ల అంతర్జాల సేవలు అనుసంధానం అయినట్లు తెలుస్తోంది. గతంలో కావాల్సిన స్థలం కావాలంటే కేటాయించాం. ఇంకా మాకు అప్పగించలేదు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం.

# హడావుడిగా చేపట్టి.. అర్ధాంతరంగా ఆపేసి

మెదక్: ఎనిమిది గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిని విస్తరించాలని నిర్ణయించారు. ఇందుకు నిధులు మంజూరు కావడంతో గతేడాది శంకుస్థాపన చేశారు. ఎన్నికల అనంతరం పనులను మొదలు పెట్టారు. హడావుడిగా చేపట్టి.. అసంపూర్తిగా వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాజకీయ జోక్యం కారణంగానే అర్ధాంతరంగా పనులను నిలిపివేసినట్లు సమాచారం. ఈ అంశంపై 'న్యూస్‌టుడే' పరిశీలన కథనం...

ఇరుకైన దారి.. మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తా నుంచి దాయర శివారులో ఉన్న గోసంద్రం, పిట్లం చెరువుల వరకు ఉన్న రహదారిని విస్తరించాలని నిర్ణయించారు. హవేలిఘనపూర్ మండలంలోని ముత్తాయికోట, కూచన్‌పల్లి, దేవునికూచన్‌పల్లి, తొగిట, ముత్తాయిపల్లి, ఫరీద్‌పూర్, సర్ధన, జక్కన్నపేట గ్రామాలకు ఈ మార్గం నుంచే వెళ్లాలి. ఆయా గ్రామాల ప్రజలు ఎక్కువగా చమాన్ చౌరస్తా మీదుగా రాకపోకలు కొనసాగిస్తారు. సర్ధనకు వెళ్లే ఆర్టీసీ బస్సు సైతం ఈ దారి నుంచే వెళ్తుంది. రాందాస్ చౌరస్తా నుంచి చమాన్ మీదుగా ఆవారబస్తీ వరకు ఉన్న రహదారి చాలా ఇరుకుగా ఉంది. ఈ క్రమంలో రహదారి విస్తరణకు గత ప్రభుత్వ హయాంలో రూ.7.80 కోట్లు మంజూరయ్యాయి. అక్టోబర్‌లో పనులకు శంకుస్థాపన చేపట్టారు.

ఇష్టారీతిన పనులు... టెండర్ దక్కించుకున్న గుత్తేదారు పనులను ఇష్టారీతిగా చేపడుతున్నారు. రహదారి విస్తరణతో పాటు ఇరువైపుల మురుగుకాలువ, మధ్యలో విభాగిని, వీధి దీపాల బిగింపు పనులు చేపట్టాలి. ముందుగా సినీమ్యాక్స్ థియేటర్ వద్ద నుంచి దాయర వెళ్లే శ్మశానవాటిక సమీపం వరకు ఇరువైపుల మురుగుకాలువ పనులను చేపట్టారు. కొన్నిచోట్లనే పైపులు వేసి మ్యాన్‌హోల్ బిగించారు. ఇళ్ల ముందు గోతులు తవ్వి వదిలేశారు. మ్యాన్‌హోల్‌ను సరిగా బిగించలేదు. హడావుడిగా పనులు ప్రారంభించిన గుత్తేదారు ప్రస్తుతం నిలిపివేయడం గమనార్హం. రాజకీయ జోక్యం వల్లే ఆగిపోయినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సినీమ్యాక్స్ థియేటర్ సమీపంలో గోతులను తవ్వి ఒకచోట పైపులు వేయగా, మరోచోట అలాగే వదిలేశారు. ప్రధాన రహదారి కావడంతో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది.

విస్తరించకుండానే... రాందాస్ చౌరస్తా నుంచి గోసంద్రం, పిట్లం చెరువుల వరకు ఉన్న రహదారిని 50 అడుగులు విస్తరించాలి. 16,17,20,22,23 వార్డుల పరిధిలో విస్తరణ కోసం ఆయా దుకాణాలు, గృహాలకు మార్కింగ్ వేశారు. రాందాస్ చౌరస్తా వద్ద దుకాణాల మెట్లను, చమాన్‌లో ఉన్న హొటళ్లను, ఆయా దుకాణాల డబ్బాలను బల్దియా అధికారులు తొలగించారు. చమాన్ నుంచి ఆవారబస్తీ వరకు రహదారి చాలా ఇరుకుగా ఉంటుంది. విస్తరణకు అడ్డుగా ఉన్న కట్టడాలను కూల్చివేయక ముందే మురుగుకాలువ పనులను చేపడుతుండటం గమనార్హం. మురుగుకాలువ పనులు పూర్తయ్యాక విస్తరణ కోసం కట్టడాలను కూల్చివేస్తామని మున్సిపల్ టీపీవో భూపతి తెలిపారు.

కూల్చివేయాలని లేఖ రాశాం

రియాజ్, ర.భ శాఖ ఏఈరహదారి విస్తరణ విస్తరణ చేపట్టి, కట్టడాలను కూల్చివేయాలని మున్సిపల్ అధికారులకు లేఖ రాశాం. గుత్తేదారు అర్ధాంతరంగా పనులు నిలిపివేశారు. ఈ విషయమై సంప్రదిస్తే వచ్చి పనులు చేస్తానని చెబుతున్నారు.

# సెలయేరులా సాగుతూ..

తూప్రాన్: హల్దీవాగు రైతులకు ఎంతో మేలు చేస్తోంది. మండుటెండల్లోనూ పొలాలు పచ్చగా ఉండేందుకు దోహదం చేస్తోంది. ఈ వాగు నుంచి గోదావరి జలాలను వదులుతుండటంతో సిద్దిపేట, మెదక్ జిల్లాల పరిధిలో 15 వేలకు పైగా ఎకరాలు సాగవుతోంది. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం తున్కిఖల్సా సమీపంలో తపాస్‌ఖాన్ చెరువు వద్ద పుడుతున్న హల్దీవాగు చౌదర్‌పల్లి, గుంటిపల్లి, శాకారం, అంబర్‌పేట, సీతారాంపల్లి, అనంతగిరిపల్లి, వేలూరు, నాచారం మీదుగా తూప్రాన్ మండలం యావాపూర్, కిష్టాపూర్, గుండ్రెడ్డిపల్లి, వెంకటరత్నాపూర్, నాగులపల్లి, వెలుర్తి మండలం కొప్పులపల్లి, మెల్లుర్ ఉప్పులింగాపూర్, రామాయపల్లి, కుకునూర్, శెట్‌పల్లికలాన్, చిన్నశంకరంపేట మండలం ధరిపల్లి, మెదక్ మండలం బాలనగర్, కొల్చారం మండలం కొంగోడు గ్రామాల పొలాలకు నీరందిస్తోంది. రైతులు ఈ నీటిపై ఆధారపడి సాగు చేసుకుంటున్నారు. వాగుకు ఇరువైపుల ఉండే పొలాలకు మోటార్లను బిగించి నీటిని మళ్లిస్తున్నారు. దీంతో పాటు వాగు పరివాహక ప్రాంతాల్లో భూగర్భజలాలు పెరిగి గతంలో వేసిన బోరు బావులు సైతం ఎక్కువగా నీరు పోస్తుండటంతో



రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.రెండు పంటల విధానం..

హల్దీవాగు పరివాహక ప్రాంతంలోని రైతులకు ద్విపంటల విధానంతో అధిక లాభం చేకూరుతోంది. మెదక్, సిద్దిపేట జిల్లాలోని సుమారు 50 గ్రామాల రైతులకు హల్దీవాగు ఎంతో లాభాలను చేకూర్చుతోంది. రాష్ట్ర ప్రభుత్వం హల్దీవాగులోకి గోదావరి జలాలను విడుదల చేయడంతో గత రెండేళ్లుగా రైతులు రెండు పంటలను సాగు చేస్తున్నారు. గతంలో వర్షాకాలంలో మాత్రమే వరి పంటలను సాగు చేసే రైతులు ప్రస్తుతం రబీలోనూ పండిస్తున్నారు. ఈ వాగు వెంట సమృద్ధిగా నీరు ఉండడంతో చాలా మంది రైతులు భారీగా రకరకాలైన వరి పంటలను సాగు చేస్తున్నారు. ఇలా నీరు ఎప్పుడూ ఉంటే భవిష్యత్‌లోనూ ఇలాగే పంటలు సాగు చేస్తామని రైతులు చెబుతున్నారు. రెండేళ్లతో పోల్చితే ఏడాది రెండింతల దిగుబడి వచ్చిందని రైతులు పేర్కొన్నారు.

నీరు ఆగితే కష్టమే..

హల్దీవాగు పరివాహక ప్రాంతంలో ఏటా ఎండా కాలంలోనూ నీరు విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కానీ కొన్ని నెలల తర్వాత నీట విడుదల ఆగిపోవడంతో అవస్థలు పడుతున్నారు. మోటార్లు, హల్దీవాగుపై ఆధారపడే రైతులు నీరు లేక అల్లాడే పరిస్థితి ఉంది. గత ఏడాది సైతం ఇదే పరిస్థితి నెలకొనడంతో ఇబ్బందులు పడ్డారు. అధికారులు, నాయకులు ప్రత్యేక చొరవ తీసుకొని నిరంతరం నీరుండేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

నిరంతరం నీరుండాలి – మల్లయ్య, రైతు తూప్రాన్హల్దీవాగు పక్కనే రెండెకరాల పొలం ఉంది. గతంలో ఒకే పంటను సాగు చేశాను. ప్రస్తుతం వాగులో నీరు ఎక్కువ ఉండడంతో రెండు పంటలను పండిస్తున్నాను. గతంతో పోల్చితే అధిక దిగుబడి వచ్చింది. ఇలానే ఉంటే భవిష్యత్‌లోనూ హల్దీవాగుతో మంచి జరుగుతుంది. నీటి సరఫరా నిరంతరం ఉండేలా అధికారులు, నాయకులు చర్యలు తీసుకోవాలి.






# రాడిసన్ డ్రగ్స్ కేసులో ట్విస్టు..

హైదరాబాద్: రాడిసన్ డ్రగ్స్ కేసులో ట్విస్టు ఎదురైంది. గచ్చిబౌలి పోలీసుల విచారణకు హాజరుకాకుండా డైరెక్టర్ క్రిష్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. రెండు రోజుల క్రితం ఈరోజు వ్యక్తిగతంగా హాజరవుతానంటూ పోలీసులకు ఆయన సమాచారం ఇచ్చారు. నిన్న మళ్లీ పోలీసులకు ఫోన్ చేసి తనకు మరో రెండు రోజుల సమయం కావాలని కోరారు. అయితే ఇవాళ వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావాల్సిందేనని పోలీసులు తేల్చి చెప్పారు. దీంతో ఈరోజు విచారణకు క్రిష్ హాజరుపై సస్పెన్స్ నెలకొంది. రాడిసన్ డ్రగ్స్ కేసులో ఇప్పటికే గచ్చిబౌలి పోలీసులు విచారణ వేగవంతం చేశారు. అయితే ఈరోజు డైరెక్టర్ క్రిష్ పోలీసుల విచారణకు హాజరు కావాల్సి ఉంది. కానీ తన వ్యక్తిగత కారణాలు, సినిమా షూటింగ్స్ వల్ల ముంబైలో ఉన్నానని, శుక్రవారం ఉదయం విచారణకు హాజరవుతానంటూ పోలీసులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. కాగా శుక్రవారం విచారణకు రావాల్సిందిగా నిన్న మధ్యాహ్నం పోలీసులు క్రిష్‌కు సమాచారమిచ్చారు. అయితే మరో రెండు రోజులు సమయం కావాలని ఆయన పోలీసులను కోరారు. దీంతో క్రిష్ విజ్ఞప్తిని పోలీసులు నిరాకరించారు. ఎట్టి పరిస్థితుల్లో శుక్రవారం ఉదయం విచారణకు హాజరు కావాలని స్పష్టం చేశారు. ఈలోగా తనను అరెస్టు చేస్తారేమోనన్న భయంతో క్రిష్ హైకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌పై ఇవాళ మధ్యాహ్నం విచారణ జరిగే అవకాశముంది. కాగా పోలీసుల ఆదేశాల ప్రకారం ఈరోజు క్రిష్ విచారణకు హాజరవుతారా? లేదా? అన్న సస్పెన్షన్ నెలకొంది. కాగా రాడిసన్ కొకైన్ పార్టీ కేసులో కొత్త కోణాలు వెలుగుచూశాయి. ఆ పార్టీలో మొత్తం 7 గ్రాముల కొకైన్ సప్లై అయినట్లు పోలీసులు గుర్తించారు. అబ్బాస్ అలీ స్టేట్‌మెంట్‌తో కీలక విషయాలు బయటపడ్డాయి. రాడిసన్ హోటల్లో 3 గ్రాముల కొకైన్ మాత్రమే వినియగించారని, మరో 4 గ్రాముల కొకైన్‌పై ఎస్‌వోటీ, గచ్చిబౌలి పోలీసులు ఆరా తీస్తున్నారు. గత నెల 16న 2 గ్రాములు, 17న 2 గ్రాములు, 18న ఒక గ్రాము, 19న మరో 2 గ్రాముల కొకైన్ సప్లై చేసినట్లు పోలీసులు గుర్తించారు. అయితే పోలీసుల విచారణకు రాకుండా 7గురు నిందితులు తప్పించుకొని తిరుగుతున్నారు. 4 గ్రాముల కంటే తక్కువ పరిమాణం ఉంటే కోర్టులో కేసు నిలబడదని పోలీసులు చెబుతున్నారు. ఇప్పటికే మంజీరా గ్రూప్స్ డైరెక్టర్ వివేకానంద్ , పెడ్లర్ అబ్బాస్, డ్రైవర్ ప్రవీణ్ అరెస్టు అయ్యారు. నిర్భయ్, కేదార్లను విచారించి పోలీసులు నోటీసులు ఇచ్చారు. విచారణకు వెళ్తే డ్రగ్ పాజిటివ్ వస్తుందని భయపడి నిందితులు పరారీలో ఉన్నారు. రోజులు గడిస్తే నిరూపించడం ఇబ్బందికరంగా మారుతుందని పోలీసులు అంటున్నారు.

# నెలదాటితే 'డ్రగ్స్' నిర్ధారణ కష్టమే...



హైదరాబాద్‌సిటీ: కొకైన్ తీసుకున్న వారిని వెంటనే పరీక్షిస్తే నిర్ధారణ అవుతుందని, రోజులు గడిచేకొద్దీ ఆనవాళ్లు మాయం అవుతాయని మెడికవర్ ఆస్పత్రి న్యూరో సైక్రియాట్రిస్ట్ డాక్టర్ శివ అనూప్ ఎల్లా తెలిపారు. నగరంలో డ్రగ్స్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో, రాడిసన్ కొకైన్ పార్టీ విచారణ సాగుతున్న సందర్భంలో ఆయన ఈ విషయం వివరించారు. కొకైన్ లాంటి మాదక ద్రవ్యాలు సేవిస్తే దాని ఆనవాళ్లు రక్తం, మూత్రం, గోళ్లు, వెంట్రుక వాటిల్లో ఉంటాయని తెలిపారు. సాధారణంగా నెలరోజులు దాటితే ఆనవాళ్లు దొరికే అవకాశాలు తక్కువగా ఉంటాయని వెల్లడించారు.

వెంట్రుకలు, గోళ్లు వంటి పరీక్షలను అధికారుల ఆదేశాలతో ఫోరెన్సిక్ వైద్యులు చేస్తారని చెప్పారు. మాదకద్రవ్యాల ఆనవాళ్లు రక్తంలో రెండు రోజులు, మూత్రంలో మూడు, ఉమ్ములో రెండు నుంచి నాలుగు రోజులు, గోళ్లు, వెంట్రుకల్లో మూడు నుంచి నాలుగు వారాల వరకు మాత్రమే ఉంటాయని, ఆ సమయంలో పరీక్షిస్తేనే నిర్ధారణకు అవకాశం ఉంటుందని వివరించారు.

# దక్షిణ తెలంగాణపై కేసీఆర్‌ది సవతి తల్లి ప్రేమ: వంశీచంద్ రెడ్డి

మహబూబ్ నగర్: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రాజకీయ బిక్ష పెట్టిన పాలమూరు జిల్లాను తీవ్ర అన్యాయం చేశారని, కృష్ణాజలాలను ఆంధ్ర పాలకులు దోచుకుపోతుంటే దద్దమ్మలా కేసీఆర్ చూస్తుండిపోయారని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు వంశీచంద్ రెడ్డి విమర్శించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మహబూబ్‌నగర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. కృష్ణ బేసిన్ నీటిని పెన్నా బేసిన్‌కు ఆంధ్ర నాయకులు తీసుకుపోతున్నా కేసీఆర్ అడ్డుపడలేదని ఆరోపించారు. మూడేళ్ళలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పారని, తొమ్మిదేళ్లయినా పనులు పూర్తి కాలేదన్నారు. ప్రాజెక్టు పొడవునా నాసిరకం పనులు జరుగుతున్నాయని, కేసీఆర్ దక్షిణ తెలంగాణపై సవతి తల్లి ప్రేమ చూపించారని విమర్శించారు. కృష్ణా నదిలో తెలంగాణకు రావలసిన వాటాపై పోరాటం చేయలేదన్నారు. నాడు కేసీఆర్ స్థానంలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే 299 టీఎంసీలకు బదులుగా 577 టీఎంసీల వాటా వచ్చేదన్నారు. కేసీఆర్ డిజైన్ చేసిన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ కుంగిపోయిందన్నారు. ఉత్తర తెలంగాణలో లక్షల కోట్ల అవినీతి చేసి మేడిగడ్డను బొందల గడ్డగా మార్చారని, దక్షిణ తెలంగాణను మోసం చేశారని వంశీచంద్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు.

ప్రభాత
సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194

# బీఆర్ఎస్‌కు మరో షాక్.. బీజేపీలోకి ఎంపీ బీబీ పాటిల్

ఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల వేళ బీఆర్ఎస్‌కు మరో బిగ్ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన జహీరాబాద్ సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. గురువారం ఆయన ఢిల్లీలో బీజేపీలోకి చేరారు. కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, పార్టీ ఇన్ ఛార్జ్ తరుణ్ చుగ్, ఎంపీ లక్ష్మణ్ సమక్షంలో చేరారు. జహీరాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పాటిల్ బరిలోకి దిగనున్నారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తూ రాజీనామా లేఖను అధ్యక్షుడు కేసీఆర్‌కు పంపించారు. తనకు పార్టీలో అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలంటూ లేఖలో పేర్కొన్నారు. ఇవాళ సాయంత్రం ఢిల్లీలో ఆయన కాషాయ కండువా కప్పుకున్నారు. కాగా, ఎన్నికల షెడ్యూల్ రాకముందే బీజేపీ లోక్‌సభ అభ్యర్థుల తొలి జాబితా ప్రకటించనుంది. ఇందుకుగాను ఆ పార్టీ అగ్ర నాయకత్వం ఇప్పటికే కసరత్తు పూర్తి చేసింది. తొలిజాబితాలో అభ్యర్థుల పేర్ల ఖరారు కోసం గురువారం సాయంత్రం సమావేశమైన బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ(సీఈసీ) భేటీ శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటల వరకు సాగింది. తొలి విడతలోనే సగం సీట్లకు ఎంపీ అభ్యర్థులను ప్రకటించనున్నట్లు సమాచారం. రెండు మూడు రోజుల్లో ఈ జాబితా విడుదల చేసే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో తక్కువ మెజారిటీతో గెలిచిన సీట్లు, పార్టీ బలహీనంగా ఉన్న సీట్లలో అభ్యర్థులను తొలుత ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. దీని ద్వారా ఆయా అభ్యర్థులకు ఎన్నికల ప్రచారానికి కనీసం 50 రోజుల సమయం దొరుకుతుందని పార్టీ నాయకత్వం భావిస్తోంది.

కాగా, తొలి జాబితాలో తెలంగాణ నుంచి సుమారు 8 మంది అభ్యర్థులు ఖరారైనట్లు సమాచారం. ఖరారైన వారిలో సికింద్రాబాద్-కిషన్‌రెడ్డి, నిజామాబాద్-ధర్మపురి అరవింద్, కరీంనగర్- బండి సంజయ్, చేవెళ్ల- కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, భువనగిరి- బూర నర్సయ్యగౌడ్, హైదరాబాద్- మాధవిలత, మహబూబ్‌నగర్- డీకే అరుణ, నాగర్‌కర్నూల్- భరత్ ప్రసాద్ ఉన్నట్లు తెలుస్తోంది.

# కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తిగా కొట్టుకుపోవాలని కుట్ర: కేటీఆర్



హైదరాబాద్: భారాస నేతలు తెలంగాణ భవన్ నుంచి మేడిగడ్డ ప్రాజెక్టు సందర్శనకు బయలుదేరారు. కేసీఆర్ మినహా మిగతా ముఖ్య నేతలంతా తరలివెళ్లారు. తొలుత మేడిగడ్డను సందర్శించిన అనంతరం అన్నారం బ్యారేజీని పరిశీలించనున్నారు. అక్కడ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వనున్నారు. ప్రభుత్వానికి రైతుల కంటే రాజకీయమే ముఖ్యమైందని కేటీఆర్ విమర్శించారు. మేడిగడ్డకు బయలుదేరే ముందు ఆయన మాట్లాడారు. 'తప్పు జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తిగా కొట్టుకుపోవాలని కుట్ర చేస్తున్నారు. వర్షాకాలం వచ్చేలోపు ప్రాజెక్టుకు మరమ్మతులు చేయాలి' అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైందని మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. లక్షలాది ఎకరాలకు సాగునీరు ఇచ్చేలా కేసీఆర్ నిర్మించారని కొనియాడారు. రాష్ట్రంలో కరవు లేకుండా చేసేందుకే కాళేశ్వరం నిర్మించారని తెలిపారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం ఏదో జరిగినట్లు.. లేనిది ఉన్నట్టు చూపుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టును జీర్ణించుకోలేక దుష్ప్రచారం చేస్తున్నారు. రైతుల పట్ల ప్రేమ ఉంటే వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టాలి. మేడిగడ్డ ఆనకట్టలోని 84 పిల్లర్లలో 3 మాత్రమే కుంగాయి. లోపాలను సవరించాలి కానీ.. రాజకీయం చేయొద్దు. రాజకీయం చేసేందుకు మేడిగడ్డను వాడుకుంటున్నారు' అని పోచారం విమర్శించారు.

# కాళేశ్వరం తప్పిదాలపై బహిరంగ చర్చకు సిద్ధమా?: కోదండరాం



హైదరాబాద్: భారాస వైఖరి దొంగే దొంగ అన్నట్లుగా ఉందని తెజస అధ్యక్షుడు కోదండరాం విమర్శించారు. నాంపల్లిలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుంగిన మేడిగడ్డ బ్యారేజీ పటిష్ఠంగా ఉందనడం విడ్డూరమన్నారు. 3 పిల్లర్లు మాత్రమే కుంగాయని భారాస వితండవాదం చేస్తోందని ధ్వజమెత్తారు. 'కాళేశ్వరం ప్రాజెక్టులపై జరిగిన తప్పిదాలపై బహిరంగ చర్చకు సిద్ధమా?మిలియన్ మార్చ్ స్ఫూర్తితో మార్చి 10న చర్చకు రావాలి. ఊరూరా తిరిగి భారాస బండారం బట్టబయలు చేస్తాం. కాళేశ్వరం కామధేనువు ఎలా అవుతుందో కేసీఆర్ చెప్పాలి. ఆ ప్రాజెక్టు మూడు రకాల సంక్షోభాలకు కారణమైంది. సాగునీరు, ఇంజినీర్ వ్యవస్థ, నిధుల సంక్షోభానికి గురైంది' అని విమర్శించారు. తన స్వప్రయోజనాల కోసమే కేసీఆర్ ఈ ప్రాజెక్టు చేపట్టారని కోదండరాం ఆరోపించారు. ఇంజినీర్లతో సంబంధం లేకుండా డిజైన్లు మార్చారని.. వాటికి కేంద్ర జలసంఘం అనుమతులు తీసుకోలేదన్నారు. బ్యారేజీ నిర్మాణానికి మేడిగడ్డ సరైంది కాదని సీడబ్ల్యూసీ చెప్పిందని గుర్తుచేశారు. ఆ హెచ్చరికను కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని.. పంప్‌హౌస్‌లు మునుగుతాయని చెప్పినా పట్టించుకోలేదని కోదండరాం అన్నారు.

# ఇక షెడ్డుకు పోవాల్సిందే.. బీఆర్ఎస్ నేతలకు ఉత్తమ్ సెటైర్



హైదరాబాద్, మార్చి 1: "చలో మేడిగడ్డ" బయలుదేరిన బీఆర్ఎస్ కాన్వాయ్‌లోని ఓ బస్సు టైర్ పగడంతో చిన్న అపశృతి చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనపై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. "బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వెళ్తున్న బస్సు టైర్ పగిలింది అని చూశా. కారు టైర్లు అన్నీ మిగిలిపోయాయి. ఇక షెడ్డుకు పోవాల్సిందే" అంటూ మంత్రి సెటైరికల్ కామెంట్స్ చేశారు.

**ఎన్‌డీఎస్‌ఏకు పూర్తిగా సహకరిస్తాం...** ఉత్తమ్ ఇంకా మాట్లాడుతూ.. 2023 అక్టోబర్ 21న మేడిగడ్డ కుంగిపోయిందని.. తాము అధికారంలోకి వచ్చేవరకు కేసీఆర్ నోరు మెదపలేదన్నారు. నల్లగొండ సభలో ఏం మాట్లాడలని కేసీఆర్ వెళ్లారని ప్రశ్నించారు.

తెలంగాణని నాశనం చేసి మళ్ళీ ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మేడిగడ్డ ప్రాజెక్ట్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదన్నారు. మేడిగడ్డపై ఎన్‌డీఎస్‌ఏకు పూర్తిగా సహకరిస్తామని తెలిపారు. మేడిగడ్డ దగ్గరకి బ్యారేజీ తరలించేందుకే తుమ్మిడిహెట్టి దగ్గర నీటి లభ్యత తక్కువ అని కేసీఆర్ చెప్పారని.. సీడబ్ల్యూసీ చెప్పిందని కేసీఆర్ అబద్ధం చెప్పారని కేంద్రం చెప్తోందని అన్నారు. మేడిగడ్డపై విజిలెన్స్ నివేదిక త్వరలో వస్తుందని.. బాధ్యుల పేర్లతో సహా నివేదిక వస్తుందని తెలిపారు. నివేదిక అనుగుణంగా బాధ్యులపై చర్యలు ఉంటాయని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు.

# 65 శాతం ముస్లింలకు మోదీ పథకాలతో లబ్ధి: కొండా విశ్వేశ్వరరెడ్డి

హైదరాబాద్: 65 శాతం మంది ముస్లింలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ పథకాలతో లబ్ధి చేకూరుతుందని బీజేపీ నేత కొండా విశ్వేశ్వరరెడ్డి వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. కొత్త ప్రభుత్వం చేతిలో బీఆర్ఎస్ సర్కార్ చిప్ప పెట్టిపోయిందని, ఎఫ్ఆర్‌బీఎం పరిధి మించిపోయినా కొత్తగా అప్పు తీసుకునేందుకు మోదీ అవకాశం ఇచ్చారని అన్నారు. రాష్ట్రం ఆర్థికంగా నడుస్తోందంటే కారణం ప్రధానేనని, పార్లమెంట్ ఎన్నికల్లో మోదీకి ఓటేయాలని మేము గర్వంగా అడుగుతామన్నారు. గ్రామీణ అభివృద్ధి కూడా మోదీ వల్లనే జరుగుతోందని, రూ. 9 వేల కోట్ల అప్పు ఇవ్వలేకపోతే రాష్ట్రం చీకట్లోకి వెళ్ళేదని కొండా విశ్వేశ్వరరెడ్డి అన్నారు. కాంగ్రెస్ వాళ్ళు రాహుల్ గాంధీకి ఓటేయాలని అడగలేరని, తెలంగాణలో బీజేపీకి ఎక్కువ సీట్లు ఇస్తే నిధులు తెచ్చుకునే అవకాశం ఉంటుందన్నారు. బీజేపీ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్ రెడ్డిని కలిస్తే కాంగ్రెస్‌లో చేరతున్నారని దుష్ప్రచారం చేశారని, సీఎం, మంత్రులు మోదీని కలిసినందున.. వారు కూడా బీజేపీలో చేరతారా? అని ప్రశ్నించారు. కాళేశ్వరంపై చర్చ చేస్తున్నారు.. కానీ చర్యలు తీసుకోవడం లేదని, కాళేశ్వరం మొత్తం వదిలేసి కేవలం మేడిగడ్డను పట్టుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్‌ను కాపాడుతోందని, బీఆర్ఎస్‌తో బీజేపీ పొత్తులు ఉండవని.. మేము ఎవరితోనూ పొత్తు పెట్టుకోమని కొండా విశ్వేశ్వరరెడ్డి స్పష్టం చేశారు. చేవెళ్లలో బీజేపీ 2 లక్షల మెజారిటీ ఓట్లతో గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ నేతల మాటలను ఆ పార్టీ అధిష్టానం వినడం లేదని, కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాలని అంటున్నా.. కాంగ్రెస్ జాతీయ నాయకత్వం ఒప్పుకోవడం లేదన్నారు. తనకు చేవెళ్ళ టికెట్ వచ్చినా.. రాకపోయినా పార్టీ కోసం పనిచేస్తానని.. టికెట్ ఇస్తామని తనకు కూడా ఎవరూ ఎలాంటి గ్యారెంటీ ఇవ్వలేదని కొండా విశ్వేశ్వరరెడ్డి పేర్కొన్నారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660